# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 58, EDITOR:CHERUKU UPENDAR, DATE : THURSDAY 22 JUNE 2023 PAGES:4, RATE: 5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 58, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : గురువారం 22 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


### గ్రూప్-1 రద్దు కోరుతూ

## హైకోర్టులో మరో పిటిషన్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




గ్రూప్-1 రద్దు కోరుతూ హైకోర్టు లో మరో పిటిషన్ దాఖలైంది. జూన్ 11న నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలని ముగ్గురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకుండా, హాల్?టికెట్ నెంబర్, ఫొటో లేకుండానే షీట్

మిగతా 3లో...

### యోగ ద్వారా


## వైరుధ్యాలు చెరిపేయాలి



న్యూయార్క్- ప్రభాత సూర్యుడు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ భారత ప్రజలనుద్దేశించి అమెరికా నుంచి ప్రసంగించారు. వీడియో సందేశం ద్వారా మీ అందరితో కనెక్ట్ అవుతున్నానని, కానీ యోగా కార్యక్రమం మిస్ కావడం లేదన్నారు ప్రధాని మోదీ. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5.30 గంటలకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే భారీ యోగా కార్యక్రమంలో పాల్గొంటాను అన్నారు. భారత్ పిలుపు మేరకు ప్రపంచంలోని 180కి పైగా దేశాలు ఏకతాటిపైకి రావడం చారిత్రాత్మకం అని అభిప్రాయపడ్డారు. 2014లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతిపాదన వచ్చినప్పుడు రికార్డు స్థాయిలో దేశాలు మద్దతిచ్చాయి.
అప్పటి నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా యోగా ప్రపంచ

మిగతా 2లో...



# ఎన్నికల హామీలు.. ఉత్తుత్తేనా...!



- సిఎం సారు..మాట మరిచారా ?
- ఎన్నికల హామీలు నీటి మీది రాతలేనా..!
- మరుగున పడిన మెట్రో రైల్..ఎంఎంటిఎస్
- రద్దీ రవాణాతో నానా అవస్థలు
- ప్రమాదాలకు బలవుతున్న యువత
- చతికిల పడ్డ సాకి చెరువు
- కాటికి పోయిన స్మశానాలు
- సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- మెట్రో రైల్ సాధన సమితి కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ కస్బా శంకర్ రావు

తెలంగాణ బ్యూరో చీఫ్ - ప్రభాత సూర్యుడు

మరో మూడు నెలల్లో ఎన్నికల సైరన్ మ్రోగనుంది. ఒక్క సారిగా మారిన పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. మూడు ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. తాజా రాజకీయ పరిణామాలు గమనిస్తే అధికార బిఆర్ఎస్ పార్టీలో అలజడి మొదలయ్యిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మళ్ళీ అధికారం తమదే అని గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా..సిఎం కేసిఆర్‌లో వనుకు పుట్టనందననే చెప్పుకోవచ్చు. ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యే ముఖ్యమంత్రి కేసిఆర్ రాష్ట్రంలో పర్యటనలు చూస్తుంటే అది నిజమనే అర్థమవుతుంది.

ఈ నేపథ్యంలో సిఎం కేసిఆర్ పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన మరియూ ప్రారంభోత్సవ కార్య క్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో గురువారం

మిగతా 3 లో...

### బీఆర్ఎస్‌లో పెరుగుతున్న

## లైంగిక వేధింపుల ఆరోపణలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

భారత రాష్ట్ర సమితిలో ఇటీవలి కాలంలో ఎప్పుడూ లేని విధంగా సీని యర్ రాజకీయ నేతలపై లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటివి బయటకు వస్తే పార్టీకి ఇబ్బందికరం అవుతుందని వీలైనంత వరకూ హైక మాండ్ ప్రచారం జరగకుండా సైలెంట్ గా ఉంటోంది. దీంతో ఏ చర్యలు తీసుకోవడం లేదన్న అభిప్రాయం బలపడుతోంది. అయితే ఇలాంటి ఆరోపణల వెనుక హైకమాండ్ ప్రోత్సాహం కూడా ఉందని.. అది కూడా

మిగతా 2లో...

## కాంగ్రెస్ వర్సెస్ టీఆర్ఎస్...

నల్గొండ- ప్రభాత సూర్యుడు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర నల్గొండ జిల్లాలో కాక పుట్టిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమే టార్గెట్‌గా కాంగ్రెస్ నేతలు విమర్శలు ఎక్కుపెట్టడంతో బీఆర్ఎస్ నేతలు భగ్గుమంటున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తగ్గేదేలే అంటూ సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ఒక వైపు కర్ణాటక ఫలితాలు.. మరోవైపు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రతో.. టీ కాంగ్రెస్‌లో మరింత జోష్ పెరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భట్టి పాదయాత్ర ఎంటీ తర్వాత రాజకీయంగా ప్రకంపనలు రేగుతున్నాయి. నల్గొండ అభివృద్ధి, బీఆర్ఎస్ ఎన్నికల హామిలపై భట్టి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నల్గొండ

మిగతా 2లో...

### కామినేని ఆస్పత్రి

## ఛైర్మన్ ఇంట్లో ఈడీ రైడ్స్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో మరోసారి ఎన్‌ఫోర్స్ మెంట్ దాడులు సంచలనం సృష్టించాయి. తాజాగా కామినేని ఆస్పత్రి ఛైర్మన్ సూర్యనారాయణ, ఎండీ శ?రీధర్ నివాసాలపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. కేవలం ఇళ్లలోనే కాకుండా కార్యాలయాల్లో కూడా తనిఖీలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో

మిగతా 2లో...

## రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్

### టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పరితపించిన జయశంకర్ సార్ వర్ధంతి నేడు. వారి స్ఫూర్తితో ఆనాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసింది. ఆయన సిద్ధాంతాలకు ఆకర్శితులై ఉద్యమంలో అందరూ కలిసి వచ్చారు.వారి స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమంలో ప్రాణత్యాగాలతో తెలంగాణ తెచ్చారని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు అయన పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి నివాసంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ కుటుంబానికి తప్ప ఎవరికీ ప్రయోజనం చేకూరలేదు. ఆనాడు తెలంగాణతో కేసీఆర్ కు పేగు బంధం లేదు. ఈనాడు తెలంగాణతో కేసీఆర్ కు పేరు బంధం లేదు. తెలంగాణ సెంటిమెంట్ తో రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకున్నారు. తెలంగాణకు పట్టిన గులాబీ చీడను వదిలించడానికే ఈ చేరికలు.
పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన మిత్ర

మిగతా 2లో...

## 25న ఢిల్లీకి పొంగులేటీ, జూపల్లి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



అసెంబ్లీ ఎన్నికల ఏడాదిలోకి ప్రవేశించింది తెలంగాణ. దీనికి సంబంధించిన వేడి రాజుకుంటోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి ఇక ఎంతో సమయం లేదు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికార భారత్ రాష్ట్ర సమితి.. హ్యాట్రిక్‌పై గురి పెట్టింది. వరుసగా మూడోసారి అధి కారంలోకి రావడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా- ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇప్పటికే జిల్లాల పర్య టనలకు శ్రీకారం చుట్టారు. నాగర్‌కర్నూలు, మంచిర్యాల, జోగు ళాంబ గద్వాల.. జిల్లాల్లో ఇటీవలే పర్యటించారు. కొత్తగా నిర్మించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, బీఆర్ఎస్ జిల్లా పార్టీ ఆఫీసులను ప్రారంభించారు. ప్రగతి నివేదన పేరుతో నిర్వహించిన బహిరంగ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజలపై వరాల జల్లును కురిపించారు. అదే సమయంలో కాంగ్రెస్ జూలు విదిలిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి వచ్చేలా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూ పొందించుకుంటోంది. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని నిలువ రించడానికి సర్వశక్తులను ఒడ్డు తోంది. కర్ణాటక ఫార్ములాను అను సరించేలా వ్యూహాలపై కసరత్తు సాగిస్తోంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో చేరికలకూ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఖమ్మం, జోగులాంబ గద్వాల జిల్లాలకు చెందిన సీనియర్ నాయకులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి

మిగతా 2లో...

### యోగాను జీవనవిధానంగా

## మార్చుకోవాలి

### మంత్రి హరీష్ రావు

సిద్దిపేట- ప్రభాత సూర్యుడు



సిద్ధిపేట లో అంతర్జా తీయ యోగా దినో త్సవంలో మంత్రి హరీష్ రావు పాల్గొ న్నారు. మంత్రి మాట్లాడుతూ యోగ ను మన జీవన విధానం గా మార్చు కోవాలి. యోగ అన్ని రకాల వ్యాధుల కు చెక్ పెట్టవచ్చు. ఈ మధ్య కాలంలో బీపీ షుగర్ లాంటి వ్యాధుల పెరుగుతున్నాయి. ఆరోగ్యం కాపాడుకోవాలి

మిగతా 2లో...

## యోగ ద్వారా
# వైరుధ్యాలు చెరిపేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమంగా మారింది. ఓషన్ రింగ్ ఆఫ్ యోగాతో ఈ ఏడాది యోగా డే కార్యక్రమాలు మరింత ప్రత్యేకమయ్యాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వసుధైవ కుటుంబకం ఆధారంగా యోగా చేస్తున్నారు. యోగా మనకు ఆరోగ్యాన్ని, ఆయుష్‌ను, బలాన్ని ఇస్తుందని మన గ్రంథాల్లో చెప్పారు. మనలో ఎంతమంది యోగా శక్తిని అనుభవించారు? వ్యక్తిగత స్థాయిలో మంచి ఆరోగ్యం ఎంత ముఖ్యమో మనందరికీ తెలుసు. యోగా శక్తివంతమైన సమాజాన్ని నిర్మిస్తుంది.

స్వచ్ఛభారత్ వంటి అంశాల్లో స్టార్టప్‌లకు గత కొన్నేళ్లుగా కనిపించిన అసాధారణ వేగం ఈ శక్తి ప్రభావాన్ని చూపిందని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశ సంస్కృతి, సామాజిక నిర్మాణం, ఆధ్యాత్మికత, దార్శనికత ఎప్పుడూ కొత్త ఆలోచనలను స్వీకరించే, ఆదరిస్తుందన్నారు. ఎల్లప్పుడూ స్వాగతిస్తున్నామన్నారు. మనం భిన్నత్వాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నామని అలాంటి ప్రతి అవకాశాన్ని యోగా బలపరుస్తుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యోగా ద్వారా మన వైరుధ్యాలు చెరిపేయాలి. యోగా ద్వారా మన అడ్డంకులను అధిగమించాలి. ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ ను ప్రపంచానికి అందించాలి. కర్మలో నైపుణ్యమే యోగం అని చెప్పారు. మనందరికీ ఈ మంత్రం చాలా ముఖ్యమైంది. యోగాతో మన ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని, ఈ తీర్మానాలను అలవర్చుకుంటామని విశ్వసిస్తున్నాను. ఆరోగ్యమే మహాభాగ్యందేశ్వవ్యాప్తంగా 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో యోగా చేస్తున్నారు. యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో యోగా చేశారు. హమీర్ పూర్ లో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకులకు అనురాగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై.. అందరితో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఆరోగ్యం కోసం యోగా అందరూ చేయాలని కోరారు. భారతీయ జనతా పార్టీ (బిజెపి) జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా బుధవారం గురుగ్రామ్‌లోని తౌ దేవి లాల్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి కూడా హరిద్వార్‌లో యోగా చేశారు. జబల్‌పూర్‌లోని గ్యారీసన్ గ్రౌండ్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, ఆయుష్ మంత్రి సర్బానంద్ సోనోవాల్ యోగా చేశారు. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్ పూణేలో, అశ్వినీ వైష్ణవ్ బాలాసోర్ లో జరిగిన కార్యక్రమంలో యోగా చేశారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో సాయంత్రం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొననున్నారు. కాగా, ప్రతిసారీలాగే ఈసారి కూడా దేశంలోని నలుమూలల కూడా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యోగా ప్రయోజనాల గురించి అవగాహన పెంచడానికి, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు తోడ్పాటునందించేందుకు యోగా సహకరిస్తుంది.

## యోగాను జీవనవిధానంగా
# మార్చుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యం కోసం యోగ. ఖర్చు లేని పని యోగ సాధన. అందరం ఎంతో బిజీగా ఉన్నామని ఆరోగ్యాన్ని నిర్లక్షం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీ స్త్రీలకు యోగ ఆసనాలు ప్రాణాయామం నేర్పిస్తున్నాం. మెడికల్ కాలేజీలో యోగాను ఒక బాగంగా చేశామని అన్నారు. పిల్లలకు యోగ కాన్సంట్రేషన్ పెంచుతుంది. మన యోగ ప్రపంచ దేశాలలో చేస్తున్నారు. ప్రపంచం యోగ సాధన ద్వారా ఆరోగ్యాన్ని పొందింది. ఆరోగ్య తెలంగాణ అంటే గొప్ప వైద్య సేవలు అందించడం కాదు. రోగం రాకుండా కాపాడుకోవడం. 7.4 గ్రీన్ కవర్ తో దేశంలో మొదటి స్థానంలో ఉంది. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం కాలుష్యాన్ని తగ్గించడానికి అన్ని స్థాయిలలో అమలుచేస్తున్నరని అన్నారు. క్యాన్సర్ పేషంట్స్ బ్రీతింగ్ ఎక్సర్సైజ్ చేస్తూ వారు ఆ వ్యాధిని అధిగమిస్తున్నా రు. ఆరోగ్యం కాపాడుకోవాలి లేక పోతే బీపీ, సుగర్ లాంటి వ్యాధులు మనిషిని క్రమంగా పాడుచేస్తుంది. - ప్రతీ మనిషి ఇంకో పది మందికి యోగ చేపించాలి. సిద్దిపేట అనేక రంగాలలో అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉంది ఆరోగ్యంలో కూడా మనం ముందుండాలి. ప్రతీ లీడర్ తమ తమ గల్లీలో యోగ చెపించాలి. చేసే ప్రతి వ్యక్తికి మ్యాట్ ఇస్తాను. - అందరం కలిసి ఆరోగ్య సిద్దిపేటను సాధిద్దామని అన్నారు.

### జూన్ 29 నుండి జూలై 7వ తేదీ వరకు తాళ్లపాకలోని శ్రీచెన్నకేశవ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి - ప్రభాత సూర్యుడు

అన్నమయ్య జిల్లా తాళ్లపాకలో గల శ్రీ చెన్నకేశవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 29 నుండి జూలై 7వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు జూన్ 28వ తేదీ అంకురార్పణ నిర్వహిస్తారు. జూన్ 29న ఉదయం 9 నుండి 10 గంటల వరకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి శేషవాహన సేవ నిర్వహిస్తారు. జూన్ 30, జూలై 1, 2, 3వ తేదీల్లో ఉదయం పల్లకీ సేవ నిర్వహిస్తారు.

## కామినేని ఆస్పత్రి
# ఛైర్మన్ ఇంట్లో ఈడీ రైడ్స్

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఈడి అధికారుల సోదాలు చేస్తున్నారు. ఉదయం నుంచి ఈ తనిఖీలు సాగుతున్నాయి. ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. మెడికల్ కళాశాలతోపాటు యాజమాన్యం ఆస్తులపై ఆరా తీస్తున్నారు. షామీర్ పేటలోని మెడిసిటీ కళాశాల ఏరియాలో అధికారులు దాడులు చేస్తున్నారు. ఫిల్మ్ నగర్ లోని ప్రతిమా కార్పొరేట్ కార్యాలయంపై ఈడీ అధికారులు సోదాలు చేస్తున్నారు. మొత్తం రెండు టీంలుగా విడిపోయి మరీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 చోట్ల ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. బషీర్ బాగ్ లోని ఈడీ ఆఫీసు నుంచి 11 బృందాలుగా ఈడీ అధికారులు బుధవారం ఉదయం బయలుదేరారు. ఈడీ బృందాలతోపాటు సీఆర్పీఎఫ్ బలగాలు కూడా వారి వెంట ఉన్నాయి. భాగ్యనగరంతో పాటు నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్ నగర్, మేడ్చల్ జిల్లాల్లో ఈడీ రైడ్స్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కార్ఖానా, చౌటుప్పల్, జడ్చర్ల, పీవీ ఎక్స్ ప్రెస్ వే, గచ్చిబౌలి, ఓఆర్ఆర్, శామీర్ పేట వైపు ఈడీ బృందాలు వెళ్లాయి. 10 మెడికల్ కాలేజీలపై దాడులుతెలంగాణ వ్యాప్తంగా ఉన్న పది మెడికల్ కాలేజీలపై ఈడీ ఫోకస్ పెట్టింది. వివిధ ప్రాంతాల్లో ఉన్న కాలేజీల్లో తనిఖీలు చేస్తోంది. కాలేజీలతోపాటు ఆ యజమాన్యాల నివాసలు ఆఫీస్‌లలో సోదాలు చేస్తోంది. ప్రస్తుతం తనిఖీ జరుగుతున్న కాలేజీలు ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, కామినేని మెడికల్ కాలేజీమల్లారెడ్డి మెడికల్ కాలేజీబీసీఏ మెడికల్ కాలేజీ మెడిసిటీ మెడికల్ కాలేజీ ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ కామినేని ఆస్పత్రి ఛైర్మన్ సూర్యనారాయణ, ఎండీ శ?రీధర్ నివాసాలపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. కేవలం ఇళ్లలోనే కాకుండా కార్యాలయాల్లో కూడా తనిఖీలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో కూడా ఈడి అధికారుల సోదాలు చేస్తున్నారు. ఉదయం నుంచి ఈ తనిఖీలు సాగుతున్నాయి. ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. మెడికల్ కళాశాలతోపాటు యాజమాన్యం ఆస్తులపై ఆరా తీస్తున్నారు.

షామీర్ పేటలోని మెడిసిటీ కళాశాల ఏరియాలో అధికారులు దాడులు చేస్తున్నారు. ఫిల్మ్ నగర్ లోని ప్రతిమా కార్పొరేట్ కార్యాలయంపై ఈడీ అధికారులు సోదాలు చేస్తున్నారు. మొత్తం రెండు టీంలుగా విడిపోయి మరీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15 చోట్ల ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. బషీర్ బాగ్ లోని ఈడీ ఆఫీసు నుంచి 11 బృందాలుగా ఈడీ అధికారులు బుధవారం ఉదయం బయలుదేరారు. ఈడీ బృందాలతోపాటు సీఆర్పీఎఫ్ బలగాలు కూడా వారి వెంట ఉన్నాయి. భాగ్యనగరంతో పాటు నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్ నగర్, మేడ్చల్ జిల్లాల్లో ఈడీ రైడ్స్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## బీఆర్ఎస్‌లో పెరుగుతున్న
# లైంగిక వేధింపుల ఆరోపణలు

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయమేనన్న చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. అసలు ఎన్నికల సీజన్‌లో బీఆర్ఎస్ నేతలపై పెరిగిపోతున్న ఈ లైంగిక వేధింపుల ఆరోపణలు రాజకీయమా ? యాధృచ్ఛికమా ?హైదరాబాద్ నగరంలో యువ మహిళా కార్పొరేటర్ ను ఓ సీనియర్ ఎమ్మెల్యే లైంగిక వేధింపులకు గురి చేసిన అంశం సంచలనంగా మారింది. ఇది బీఆర్ఎస్ పార్టీ నంచి మీడియాకు అందిన లీక్. ఇక్కడ ఎమ్మెల్యే ఎవరో.. కార్పొరేటర్ ఎవరో ఎవరికీ తెలియదు. కానీ ఇలా ఓ సీనియర్ ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయని మీడియాకు తెలిపాయి బీఆర్ఎస్ వర్గాలు. తమ పార్టీకి ఇబ్బంది అవుతుందని తెలిసి కూడా ఇలా ఎందుకు చేశాయన్నదాంట్లోనే అసలు రాజకీయం ఉందని భావిస్తున్నారు. ఆ సీనియర్ నేతకు ఈ సారి టిక్కెట్ నిరాకరించడానికి ఇదో చాన్స్ అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక తాటికొండ రాజయ్య గురించి చెప్పాల్సిన పని లేదు.

సర్పంచ్ నవ్య చేసిన ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. తర్వాత ఆమెతో రాజీ చేసుకున్నారు . కానీ రాజయ్య మాట తప్పారని మళ్లీ ఆరోపణలు చేస్తున్నారు. ఆయన తీరు మొదటి నుంచి వివాదాస్పదమే. డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు ఆయన ఇలాంటి వ్యవహారాలకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ఆయనపై ఆరోపణలతో.. నియోజవర్గం మొత్తం ఇమేజ్ డ్యామేజ్ అయిపోయింది.

అయితే హైకమాండ్ మాత్రం ఇంకా అధికారికంగా ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదు. వీలైనంత మౌనం పాటిస్తోంది. ఇక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పై శేజల్ అనే మహిళ చేస్తున్న ఆరోపణలు రోజూ హైలెట్ అవుతూనే ఉన్నాయి. చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని ఆమె ఢిల్లీ స్థాయిలో పోరాడుతున్నారు. కానీ ఆమె బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నారని దుర్గం చిన్నయ్య అంటున్నారు కానీ.. మహిళ ఆరోపణలకే ఎక్కువ ప్రచారం లభిస్తోంది. అయితే ఈ అంశంలోనూ పెద్దగా హైకమాండ్ స్పందించడం లేదు. గతంలోనూ ఇలాంటి ఆరోపణలు మరికొందరిపై వచ్చాయి. మంత్రి వర్గన్ని పునర్ వ్యవస్థీకరిస్తారని ప్రచారం జరిగిన సమయంలో ఓ మంత్రిపై ఇలాంటి ఆరోపణలు గుప్పుమన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలకు సన్నిహితమని భావించే మీడియా చానళ్లలోనే కథనాలు వచ్చాయి. అయితే తర్వాత మంత్రి వర్గ పునర్ వ్యవస్థీకరణ జరగలేదు. ఆ ఆరోపణలు అంతటితో ఆగిపోయాయి.

ఇలాంటివి ప్రత్యేకమైన సందర్భాల్లో వచ్చినప్పుడు .. దీని వెనుక రాజకీయం ఉందా అన్న సందేహం ఎక్కువ మందికి వస్తోంది. టిక్కెట్లు నిరాకరించడానికి లేదా పదవుల నుంచి తప్పించడానికి ఈ లైంగిక వేధింపుల ఆరోపణల్ని హైలెట్ చేస్తున్నారా అన్న చర్చలు జరుగుతున్నాయి. ఏదైనా రాజకీయమే. ఇలాంటి ఆరోపణలు వచ్చిన ఎంత మందికి టిక్కెట్లు నిరాకరిస్తారన్నదాన్ని బట్టి వీటి వెనుక రాజకీయం ఉందా లేదా అన్నదానిపై క్లారిటీ వస్తుంది. కానీ ఎప్పటికీ కన్ఫర్మ్ కాదు.

## రాష్ట్రాన్ని దోచుకున్న
# కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

బృందాన్ని కాంగ్రెస్ లోకి ఆహ్వానించామని అన్నారు. కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణలో భాగంగానే పొంగులేటిని కలిసాం. రామ్ సాహెబ్ సురేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి తెలంగాణ ఏర్పాటుకు ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. ఇక కేసీఆర్ నుంచి తెలంగాణకు విముక్తి కలిగించాలని మేమంత నిర్ణయం తీసుకున్నాం. ఖమ్మం జిల్లాలో కీలక నేతల సూచన మేరకు పొంగులేటిని, ఆయన మిత్ర బృందాన్ని కాంగ్రెస్ లోకి ఆహ్వానించాం. కేసీఆర్ పతనానికి పొంగులేటి, ఖమ్మం జిల్లా నేతలు పునాది వేస్తున్నారు. త్వరలోనే ఢిల్లీకి వెళ్లి రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను పార్టీ పెద్దలకు వివరిస్తాం. ఖమ్మంలో జరిగే బహిరంగ సభ కేసీఆర్ అధికారానికి చివరి రోజు అవుతుంది. కృష్ణా పరివాహక ప్రాంతం మొత్తం కాంగ్రెస్ కు అండగా నిలబడేందుకు సిద్ధంగా ఉంది. హరగోపాల్, విమలక్క , ఉద్యమకారులపై ఉపా కేసులు పెడుతున్న పరిస్థితి రాష్ట్రంలో ఉంది. విమలక్కపై పెట్టిన ఉపా కేసును కూడా ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అన్నారు.

# కాంగ్రెస్ వర్సెస్ టీఆర్ఎస్...

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో తన పాదయాత్రలో కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శల దాడిని కొనసాగిస్తున్నారు భట్టి విక్రమార్క. కేంద్ర విచారణ సంస్థల నుంచి కుటుంబాన్ని కాపాడుకునేందుకే సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారనీ భట్టి ఆరోపించారు. కుటుంబ ప్రయోజనాల కోసమే లొంగిపోయి లాలూచీ పడడం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను అడగలేక పోయారనీ విమర్శించారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తానన్న కేసీఆర్ మాటలను జనం నమ్మే స్థితిలో లేరని ఆయన విమర్శించారు. ఃఖీను శంకరగిరి మాన్యాలకో, బంగాళా ఖాతంలోనో పడేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనీ అన్నారు. బీఆర్ఎస్ నేతలు గోడ దూకేందుకు సిద్ధమవుతున్నారని, వారికి సీఎం కేసీఆర్ అడ్డుకట్ట వేసేందుకు యత్నిస్తున్నారని భట్టి చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధిపై గుత్తా, సుఖేందర్ రెడ్డి మంత్రి జగదీష్ రెడ్డిలకు సోయలేదన్నారు. భట్టీ కామెంట్స్ బీఆర్ఎస్‌లో కాకరేపాయి. ఆయన వ్యాఖ్యలపై మంత్రి జగదీశ్‌రెడ్డి ఘాటుగానే స్పందించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నల్లగొండలో జరిగిన విద్యాదినోత్సవం సంబరాల్లో పాల్గొన్న జగదీశ్‌రెడ్డి.. బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే క్షమాపణ చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జరిగిన అభివృద్ధిని నిరూపిస్తే కాంగ్రెస్ నేతలు ముక్కులు నేలకు రాస్తారా? అంటూ సవాల్ విసిరారు. తొమ్మిది సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధికి దశాబ్ది ఉత్సవాలే నిలువెత్తు తార్కాణమన్నారు. మొత్తంగా.. కర్ణాటక గెలుపు తర్వాత జోష్ మీదున్న కాంగ్రెస్ నేతలు.. బీఆర్ఎస్‌ను గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. ఐతే..తెలంగాణ అవతరణ దినోత్సవాల జోష్‌లో ఉన్న బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్ విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్లు ఇస్తున్నారు. దీంతో నల్గొండ పొలిటికల్ పిక్చర్ ఆసక్తిగా మారింది.

# 25న ఢిల్లీకి పొంగులేటీ, జూపల్లి

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణారావును పార్టీలో చేర్చు కోవడానికి అవసరమైన చర్యలన్నింటినీ పూర్తి చేసింది కాంగ్రెస్. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు పొంగులేటి. ఆ తరువాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో జాయిన్ అయ్యారు గానీ అక్కడ ఎక్కువ కాలం పాటు కొనసాగలేకపోయారు. జూపల్లి కృష్ణారావు పరిస్థితీ అంతే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరినప్పటికీ.. ఆ పార్టీకి దూరం అయ్యారు. ఇప్పుడిక మళ్లీ సొంతగూటికి చేరబోతోన్నారు జూపల్లి. పొంగులేటితో కలిసి కాంగ్రెస్ కండువాను కప్పుకోవడానికి సమాయాత్తమౌతోన్నారు. దీనికోసం వారిద్దరూ బుధవారం వేర్వేరుగా తమ అనుచరులతో భేటీ కానున్నారు. గర్ల్ ఫ్రెండ్ ను ఇలాకూడా చంపుతారా ?, మాట్లాడాలని ఆటో కుర్చోపెట్టిన ప్రియుడు? కాంగ్రెస్‌లో చేరబోతోన్న విషయాన్ని వారిద్దరూ ఈ భేటీ అనంతరం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సైతం వారిని స్వయంగా కలుస్తారని తెలుస్తోంది. ఈ నెల 25వ తేదీన దేశ రాజధానిలో రాహుల్ గాంధీతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా కాంగ్రెస్ తీర్థాన్ని పుచ్చుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో షర్మిల సైతం త్వరలోనే కాంగ్రెస్‌లో చేరొచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది.

మారిన కాంగ్రెస్ తీరు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వలసలతో వెలవెలబోతే.. చేరికలతో బీఆర్ఎస్ కిటకిటలాడింది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా రివర్స్ అయ్యింది. ఎన్నాళ్లకెన్నాళ్లకు ఎన్నేళ్లు తిరిగొచ్చే మా ఇళ్లకు అన్న పాట చందంగా తయారైంది తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితి. గత ఎనిమిదేళ్లుగా ఎగ్జిట్ తప్ప ఎంట్రీ అన్నదే తెలియని ఆ పార్టీకి ఇప్పుడు కుప్పతెప్పలుగా చేరికలు ఉంటున్నాయి. ఎనిమిదేళ్లకు పైగా పార్టీ నుంచి వెళ్లిపోయేవారే తప్ప పార్టీలోకి వస్తామంటూ తలుపుతట్టిన వారే లేదు. దానికి తోడు వరుస ఎన్నికలలో డిపాజిట్లు సైతం కోల్పోయి డీలా పడిన కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు కొత్త జోష్ కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ తమదేనంటూ చెప్పుకోవడానికి కూడా ముఖం చెల్లనంతగా డీలా పడిన కాంగ్రెస్ కు ఇప్పుడు రాష్ట్రంలో డిమాండ్ పెరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత తొలి సారిగా ఆ పార్టీలో గెలుపు ధీమా కనిపిస్తోంది. ఇప్పటి వరకూ బాబ్బాబు రండి అంటూ ప్రత్యర్థి పార్టీలలోని అసమ్మతి నేతలను కాంగ్రెస్ బతిమలాడుకునే పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు అది రివర్స్ అయ్యింది. పెద్ద సంఖ్యలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ గూటికి చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పుడు చేరికలకు షరతులు పెట్టే స్థితిలో కాంగ్రెస్ ఉంది. కాంగ్రెస్ ఏ షరతులు పెట్టినా సర్దుకు పోయేందుకు ఇతర పార్టీల నుంచి వస్తున్న వారు అంగీకరంచేందుకు రెడీగా ఉన్నారు. ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరడానికి సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ లో టికెట్ల లొల్లి కూడా ఆ పార్టీ నుంచి పెద్ద ఎత్తున వలసలకు కారణమౌతోంది. పట్నం మహేందర్ రెడ్డి విషయమే తీసుకుంటే.. ఆయన గత ఎన్నికలలో రేవంత్ రెడ్డిని ఓడించడానికి కొడంగల్ పై పూర్తి కాన్సన్ ట్రేట్ చేశారు. రేవంత్ రెడ్డిపై తన తమ్ముడిని గెలిపించుకున్నారు. కానీ తన సొంత నియోజకవర్గంలో మాత్రం పరాజయం పాలయ్యారు. అక్కడ నుంచి విజయం సాధించిన పైలట్ రోహిత్ రెడ్డి ఆ తరువాతి పరిణామాలలో బీఆర్ఎస్ (అప్పుడు టీఆర్ఎస్) గూటికి చేరారు. ఇప్పుడు కేసీఆర్ పైలట్ రోహిత్ రెడ్డికే వచ్చే ఎన్నికలలో టికెట్ కన్ఫర్మ్ చేశారు. దీంతో పట్నం మహేందర్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయనలాగే బీఆర్ఎస్ లో చాలా మంది బలమైన నేతలకు టికెట్ దక్కే అవకాశాలు లేవు. సిట్టింగులకే టికెట్లు అంటూ ప్రకటించిన కేసీఆర్ ఆ తరువాత పని చేసే వారికే అంటూ చిన్న సవరణ చేసినా.. ఆపరేషన్ ఆకర్ష్ తో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ లోకి వచ్చి చేరిన సిట్టింగులు ధీమాగా ఉంటే.. పార్టీ కోసం కష్టపడి మాజీలుగా ఉన్న వారంతా అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ లో కి వచ్చే వారిలో టీఆర్ఎస్ అసంతృప్త నేతలే అధికంగా ఉంటారని అంటున్నారు. కాగా ఈ చేరికలు వచ్చే నెలలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనలో ఆయన సమక్షంలో ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మల్లు రవి నేతృత్వంలో రేవంత్ నియమించిన కమిటీ ఇప్పటికే కాంగ్రెస్ లో వచ్చి చేరే వారి జాబితాను సిద్ధం చేసే పనిలో ఉంది.

సంపాదకీయం

## ఫ్రీ బీలనే నమ్ముకున్న పార్టీలు

దశాబ్ధాలుగా దేశంలో కొనసాగుతున్న ఎన్నికల తంతులో ప్రతీ ఏడాది కొత్త మార్పులు వస్తూనే వున్నాయి. గతంలో ఎన్నికల హామీలు అభివృద్ధి ఆధారంగా వుండేవి. 80వ దశకం నుంచి ఎన్నికల హామీల్లో అభివృద్ధి అంశాలు తగ్గుతూ.. సంక్షేమ పథకాలకు సంబంధించిన అంశాలు పెరుగుతూ వస్తున్నాయి. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అన్ని రాజకీయ పక్షాలు ఉచిత హామీలే ఇక తమకు ఎన్నికల్లో విజయతీరాలకు చేరుస్తాయన్న నమ్మకాన్ని వచ్చేశారు. ముఖ్యంగా తెలంగాణ, ఏపీలలోని రాజకీయ పార్టీల్లో ఈ ధోరణి అమాంతం పెరిగిపోయింది. కర్నాటక ఫలితాలు వచ్చిన కొన్ని రోజులకే రాజమండ్రి వేదికగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో 6 ఎన్నికల హామీలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఎన్నికలకు ఏడాది ముందుగానే ప్రజల ముందు కీలక తాయిలాలను వుంచారు. దాంతో ఏపీలో హామీల పర్వం ముందే వచ్చేసినట్లయ్యింది. ఎన్నికలకు ఇంకా పది నెలల గడువుండగానే ప్రధాన పార్టీలు ప్రజల్ని మచ్చిక చేసుకునేందుకు యత్నాలు మొదలుపెట్టాయి. ఈ విషయంలో విపక్ష టీడీపీ కాస్త దూకుడును ప్రదర్శిస్తుందనే చెప్పాలి. మే నెలాఖరులో జరిగిన మహానాడులోనే ఏపీ వచ్చే ఎన్నికల్లో ఇవ్వబోతున్న హామీలను దాదాపు వెల్లడించేసింది. తాజాగా పూర్తి స్థాయి మేనిఫెస్టోను ఎన్నికలకు ఆరు నెలల ముందుగానే అంటే వచ్చే దసరా నాడే విడుదల చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించింది. ఇంకోవైపు వారాహి విజయ యాత్ర ప్రారంభించిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. సైతం హామీల పర్వాన్ని ప్రారంభించారు. ఇక మరో ప్రతిపక్షం బీజేపీ మాత్రం కేంద్ర ప్రభుత్వం ద్వారా పని చక్క బెట్టుకొస్తోంది. ఏపీకి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను క్రమంగా విడుదల చేయడం మొదలైంది. ఇక అధికార వైసీపీ గత ఎన్నికల హామీలను పూర్తి చేస్తున్నామంటూ ప్రచారం ప్రారంభించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన సినీ దిగ్గజం ఎన్టీఆర్.. రెండురూపాయలకు కిలో బియ్యం పథకాన్ని ప్రకటించి అప్పట్లో సంచలనం సృష్టించారు. ఆ తర్వాత కిలో బియ్యం ధర ఒక రూపాయకి తగ్గిపోయినా ఎన్టీఆర్ ప్రకటించిన రెండ్రూపాయలకు కిలో బియ్యం అనే పదబంధాన్ని కొట్టలేకపోయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా స్వర్గీయ ఎన్టీఆర్‌దేనని చెప్పాలి. ఆ తర్వాత మధ్య నిషేధం వంటి హామీలతో ఆయనే మరోసారి చరిత్ర సృష్టించారు. అయితే, ఈ హామీలు ఆ తర్వాత కాలంలో కొత్త పుంతలు తొక్కడం మొదలైంది. 2004 ఎన్నికలకు ముందు ఆనాటి విపక్ష నాయకుడు డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ హామీతో జనం మనసులను చురగొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ హామీ ఆనాడు పెద్ద సంచలనం. ఈ హామీ వైఎస్‌ఆర్‌ను రైతు బాంధవుడిగా మార్చిందనే చెప్పాలి. నిజానికి సంక్షేమ పథకాలంటేనే ఖజానాలకు భారం. కానీ ఆ భారాన్ని ప్రజల సెంటిమెంట్లతో ముడిపెట్టిన రాజకీయ పార్టీలు ఆర్థిక పరిస్థితిని దాచిపెట్టి మరీ ఉచిత హామీలను గుప్పించడం షురూ చేశాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి (నేడు భారత రాష్ట్ర సమితి) రైతు బంధు పేరిట రాష్ట్రంలో వ్యవసాయ భూములున్న వారికి వ్యవసాయ పెట్టుబడి కింద నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ పథకాన్ని ప్రారంభించింది. తాజాగా ఈ రైతు బంధు పథకం కింద ఎకరాకు ఇస్తున్న నగదు మొత్తాన్ని పెంచే యోచనలో కేసీఆర్ వున్నట్లు సమాచారం. ఉచిత హామీలతో ప్రజాభిమానాన్ని చూరగొనొచ్చు గాక.. మొన్నటికి మొన్న జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయంలో ఉచిత హామీలే కీలక పాత్ర వహించాయి. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆడవారికి, వృద్ధులకు, నిరుద్యోగులకు ఏదో ఒక పేరిట నగదు బదిలీ వంటి పథకాలను కర్నాటకలో కాంగ్రెస్ విచ్చలవిడిగా ప్రకటించింది. దాంతో కన్నడిగులు ఆ పార్టీకి అనూహ్య విజయం కట్టబెట్టారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ నాయకులిపుడు ఉచిత హామీలను ఎలా అమలు చేయాలా? అసలే అంతంత మాత్రంగా వున్న ఆర్థిక పరిస్థితి మరింత దెబ్బతినకుండా ఎలా జాగ్రత్త పడాలా అని తలలు పట్టుకుంటున్నారు.

ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీ విద్యుత్ రంగాన్ని పూర్తిగా నష్టాల పాలు చేసే ప్రమాదం వుండడంతో 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించే వారే లక్ష్యంగా యూనిట్ ధరను అమాంతం పెంచేసింది సిద్దరామయ్య ప్రభుత్వం. ఎన్నికలకు ఇంకా పదినెలలే సమయం. సరిగ్గా చెప్పాలంటే.. ప్రిపరేషన్‌కు ఆర్నెళ్లకు మించి గడువు లేదు. దీంతో అన్ని పార్టీలు తమ గేమ్ ప్లాన్‌ను మొదలు పెట్టేశాయి.

ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు మహిళల ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి వర్తిస్తుందని.. ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అంతమందికి ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు ఇస్తామని తెలిపారు. తల్లికి వందనం కింద ప్రతి బిడ్డ తల్లికి ఏటా 15 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇది కర్నాటక కాంగ్రెస్ హామీకి కాపీగానే భావించాలి. వీటితో పాటుగా ప్రతి ఇంటికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. మే నెల్లో ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టోపై అప్పుడే సెటైర్లేశారు సీఎం జగన్.

# యోగాతోనే మానసిక పరిపక్వత

**- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్**



**నాగర్ కర్నూల్ - ప్రభాత సూర్యుడు :** యోగాతో మానసిక పరిపక్వత రావటమే కాకుండా శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నాగర్ కర్నూలు నూతన సమీకృత కార్యాలయ సముదాయ ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సామూహిక యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆయూష్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగ వల్ల బుద్ధి, పని చేసే సామర్థ్యం పెరుగుతుందన్నారు. యోగ ప్రాముఖ్యతను గుర్తించిన అనేక కార్పొరేట్ సంస్థలు దానిని తప్పనిసరి చేశాయని తెలిపారు. ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగా సాధన అవసరమన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి మనిషి ఆరోగ్యం అత్యంత కీలకం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజు కొంత సమయాన్ని యోగా కు తప్పనిసరిగా కేటాయించాలన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయని, ముఖ్యంగా శరీరం యాక్టివ్ గా ఉండడమే కాకుండా ఫిట్ గా తయారవుతుందన్నారు. యోగ మానసిక ఆరోగ్యానికి, శరీర దృఢత్వానికి ఎంతో సహాయ పడుతుందని, ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారు, తరచుగా పొట్ట సమస్యలతో ఇబ్బంది పడేవారు తప్పకుండా యోగాసనాలు వేయాలన్నారు. ఇలా చేయడం వల్ల సులభంగా ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సతీమణి మహేశ్వరి ఉదయ్ కుమార్, అదనపు కలెక్టర్ ఎస్ మోతిలాల్, డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్, ఆయుష్ డాక్టర్ గోపాల్, పతాంజలి జిల్లా మహిళా సేవా సమితి అధ్యక్షులు యోగ ట్రైనర్ సంధ్యారాణి, లక్ష్మి, శ్రీమతి, రేనయ్య, రెడ్ క్రాస్ కార్యదర్శి రమేష్ రెడ్డి ఆశాలు అంగన్వాడీలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు.. ఉత్తుత్తేనా..!

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. రామచంద్రాపురం మండలం కొల్లూర్ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు, కొండకల్,వెలమల గ్రామంలో రైల్ కోచ్ ఫ్యాక్టరీలను ప్రారంభిచనున్నారు. అనంతరం మధ్యాహ్నం గంటలు 12.30 నిమిషాలకు పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి శంకుస్థాపను చేసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు. దీంతో ముఖ్యమంత్రి కేసిఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తెరపైకి వచ్చాయి. పటాన్‌చెరు నుండి ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హామీ, పటాన్‌చెరు,సంగారెడ్డి వరకు ఎంఎంటిఎస్, మెట్రో రైల్ పొడిగింపు నీటిమీది రాతలుగానే మిగిలిపోయాయిని అక్కడి ప్రజలు గుర్తుచేస్తున్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గం ప్రాంత ప్రజలకు ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులో లేకుండా పోతుంది. ఒకవైపు ఆర్టీసీ చార్జీలు పెరగడం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ వాహనదారులకు నరకయాతన చూపిస్తోంది. ఈ నేపథ్యంలో కాలుష్యానికి దూరంగా ఉండే ఎంఎంటీఎస్, మెట్రో రైల్ ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలంగా ఇక్కడి ప్రాంతం వాసులు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ధనికులు రాకపోకలు సాగించే ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో ఏర్పాటు కోసం గతంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసిఆర్ మరియూ మియాపూర్ నుంచి పటాన్‌చెరు, సంగారెడ్డి వరకు మెట్రో, ఎంఎంటిఎస్‌ల లైన్ పొడిగింపు హామీ ఇప్పటికీ నెరవేరనే లేదు. 2014,2018లో రెండు పర్యాయాలు ఎన్నికల ప్రచారంలో కేసిఆర్ ఇచ్చిన హామీలు నీటిమీది రాతలుగానే మిగిలిపోయాయి. ఇందుకోసం అనేక పోరాటాలు చేస్తున్న ఇక్కడ ప్రజలకు నిరాశే ఎదురయ్యింది. పటాన్‌చెరు వందలాది పరిశ్రమలు, మెడికల్ అండ్ సర్జికల్ పార్క్ , విద్యాలయాలకు నిలయంగా ఉంది. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న పటాన్‌చెరుకు మాత్రం ప్రభుత్వం పిసినారితనం చూపిస్తుంది. దశాబ్ద కాలంలో పదింతలు జనసాంద్రత పెరిగి కాలనీలు పెరగాయి. నగరానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎక్కువయ్యారు. కానీ ప్రజా రవాణా వ్యవస్త పెరగలేదు. మీ చావు మీరు చావండి అంటూ ప్రజల ఇబ్బందులను గాలికి వదిలేసిన మంత్రి జిల్లా మంత్రి హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బడా బాబులకు సకల మర్యాదలు కల్పించేందుకు తాపత్రయ పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసుకునేందుకు నిరుపేద ఓటర్లే ప్రధాన అస్త్రంగా పావులు కదుపుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వం వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తి విఫలమాయ్యారనే విమర్శలు ఘటుగానే వినిపిస్తున్నాయి. పటాన్‌చెరు, ముత్తంగి, ఇస్నాపూర్, సంగారెడ్డి ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు నగరానికి రాకపోకలు సాగిస్తున్నారు. పటాన్‌చెరు నుంచి ఎల్బీనగర్ కు బస్సులో ప్రయాణించాలంటే సుమారు నాలుగు గంటల సమయం పడుతుంది. అంటే పుణ్యకాలం పూర్తిగా ట్రాఫిక్‌లోనే గడిచిపోతుంది. ఇకపోతే ద్విచక్ర వాహనదారుల అవస్తలు వర్ణనాతీతం. దీనికి తోడు బంబర్ ఆఫర్‌లాగ రోడ్ యాక్సిడెంట్‌లతో అనేక మంది రోడ్డు ప్రమాదాల భారీనా పడుతున్నారు. అదే మెట్రో రైల్ లాంటి ప్రజా రవాణా వ్యవస్థ ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి తెస్తే గంటల వ్యవధిలో గమ్యస్థానానికి చేరుకోవాడమే కాకుండా సురక్షితంగా ఉంటుందని స్థానిక ప్రజల ఆకాంక్షిసున్నారు. ప్రజల ప్రయోజనం కోసం మెట్రో రైలు సాధన సమితి ఏర్పాటు చేసి సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కస్బా శంకర్ రావు ఆద్వర్యంలో పటాన్‌చెరుకు చెందిన కొంత మంది రాజకీయ నేతలతో కలిసి పలు రకాల పోరాటాలు చేశారు. కనీస స్పందన కూడా లేకపోగా, స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాడని విమర్శలు బాహాటంగానే వినిసిస్తున్నాయి. అధికార వ్యామోహమే తప్ప, ప్రజాభిష్టాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి స్థానిక సమస్యలను జిల్లా మంత్రి హరిష్ రావుకు గాని, ముఖ్యమంత్రి కేసిఆర్‌కు వివరించే ప్రయత్నం కూడా చేయలేదని ఆరోపణలతో ప్రజా ఆగ్రహానికి గురయ్యాడు. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం గతంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసాడని ఇక్కడ ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. పరిస్థిలుతు ఇదే తరహాలోనే కొనసాగితే..తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. పారిశ్రామిక ప్రాంత వాసులను సమీకరించి, భవిష్యత్‌లో ఎంఎంటీఎస్, మెట్రో రైల్ సాధన కోసం తీవ్ర ఉద్యమాలు జరిగే ప్రమాదం పొంచిఉంది. అదే గనకు జరితే పూర్తిగా స్థానిక ఎమ్మెల్యే వైఫల్యంగానే భావించాల్సి వస్తుంది. భ్యవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే సారు స్పందించారా సరే..! లేదంలో రానున్న ఎన్నికల్లో తమ సత్తా ఎంటో చూపేందకు ప్రజలు సిద్దంగా ఉన్నారని బహిరంగంగానే గుసగుసలు వినిపిస్తున్నాయి.

### సీఎంకు సమస్యల స్వాగతం

వివిధ అభివృద్ధి కార్యక్రమాలో భాగంగా నేడు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు సూపర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి శంకుస్థాపనకు విచ్చేస్తున్న సీఎం కేసిఆర్‌కు సమస్యలు స్వాగతం పలుకనున్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చక పోగా, ప్రధాన సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇక్కడికి ప్రజలకు శాపంలా మారిన నక్కవాగు సమస్యల పరిష్కారానికి నోచుకేలేదు. సాకి చెరువున ట్యాంక్‌బండ్‌లా మారుస్తామని మంజూరు చేసిన 9 కోట్ల నిధులు ఏమయ్యాయో ఎవ్వరికి అంతుపట్టని ప్రశ్నగా మిగిలిపోయింది. అధునాతన హంగులతో నిర్మిస్తామన్న స్మశాన వాటిక అటకెక్కి కూర్చుంది. ఈ హామీలన్ని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సాక్షిగా సాక్షాత్తు మంత్రి హరిష్ రావే ఇచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో మంత్రి,ఎమ్మెల్యేలు విఫలమయ్యారు. నేటి ముఖ్యమంత్రి కేసిఆర్ పర్యటనతో సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని, గతంలో ఇచ్చిన మాట నిలుపుకుంటారిని స్థానిక ప్రజలు అశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గతంలో మాదిరిగానే పటాన్‌చెరు ప్రజలకు కల్లబొల్లి కబుర్లు చెప్పి వరాలు వెదజల్లి పోతారా..లేక ఇచ్చిన హామీ నిలుపుకుంటారా అన్న సందేహం అటు ప్రజలు, ఇటు నేతలు వ్యక్తం చేస్తున్నారు.

### మెట్రో మాకు.. ఓటు మీకు..!

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు హామీలే ప్రధాన ఎజెంగా ముందుకు సాగేలా ఉన్నాయి. మెట్రో మాకు..ఓటు మీకు..అన్న నినాదంతో కొందరు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. జొరేక్ ధక్కా..మెట్రో పక్క నినాదాలతో ప్రజల్లోనిక వెళ్ళనున్నారు. ఈసారి ఎన్నికలు పటాన్‌చెరు నియోజకర్గంలో ప్రజా రవాణా వ్యవస్థ చుట్టూ ముడిపడి ఉంది. గతంలో ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా గెలిచి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, మరోసారి మోసపోయేందుకు ఇక్కడి పారిశ్రామిక ప్రజలు సిద్ధంగా లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు ప్రధాన సమస్య మెట్రో ఏర్పాటు ప్రధాన పార్టీల్లో ఎవ్వరు పరిష్కరింస్తే తమ ఓటు వారికే అన్నట్లుగా బాహాటంగా చెప్పకపోయినా..అంతర్గతంగా మాత్రం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

## గ్రూప్-1 రద్దు కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారని ఆ ముగ్గురు పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాలని పిటిషన్?లో కోర్టును అభ్యర్థించారు. ఈ నెల 11న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష సాఫీగా ముగిసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 994 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 3,80,081 మంది దరఖాస్తు చేసుకోగా 2,33,248 మందే హాజరయ్యారు. హాజరు శాతం 61.37గా నమోదైంది. టీఎస్‌పీఎస్సీ (లో లీకేజీ వ్యవహారం కారణంగా ప్రిలిమ్స్ పరీక్షను మళ్లీ నిర్వహించింది. ఈ నేపథ్యంలో అన్ని పరీక్ష కేంద్రాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిబంధలను కఠినంగా అమలు చేశారు. గత గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోగా ఈసారి అలా చేయలేదు.

## ప్రధాని మోడీకి బెదిరింపు కాల్స్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ప్రధాని నరేంద్ర మోదీని చంపేస్తామంటూ ఢిల్లీ పోలీసులకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ప్రధానితో పాటు ఓ కేంద్రమంత్రిని, బిహార్ ముఖ్యమంత్రిని కూడా చంపేస్తామని బెదిరించారు. వెంటనే అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు ఆ కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయో ఇన్వెస్టిగేట్ చేస్తున్నారు. వరుస పెట్టి రెండు కాల్స్ రావడం వల్ల అంతా స్పెషల్‌గా ఓ టీమ్‌ని ఏర్పాటు చేసి విచారించారు. ముందు ఫోన్ చేసి బిహార ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను చంపేస్తామని బెదిరించిన ఆ వ్యక్తి...ఆ తరవాత మరోసారి కాల్ చేశాడు. ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రినీ హత్య చేస్తామని వార్నింగ్ ఇచ్చాడు. ఇన్వెస్టిగేట్ చేసిన పోలీసులు ఆ యువకుడిని గుర్తించారు. ఆ యువకుడి పేరు సంజయ్ వర్మ అని తెలుస్తోంది. ప్రాథమికంగా అందిన వివరాల ప్రకారం...ఆ యువకుడి కుటుంబ సభ్యులనూ పోలీసులు విచారించారు. రాత్రి నుంచి తాగుతూనే ఉన్నాడని వాళ్లు వెల్లడించారు. ప్రస్తుతానికి సంజయ్ వర్మ పరారీలో ఉన్నాడు. ఢిల్లీలోని మదీపూర్‌లో ఉంటున్న సంజయ్ వర్మ..మద్యం మత్తులో ఇలా బెదిరించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అరెస్ట్ చేసేందుకు అన్ని చోట్లా వెతుకుతున్నారు

క్షతగాత్రులను పరామర్శించిన

## మేయర్ విజయలక్ష్మి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : బైరమల్ గూడా ఫ్లైఓవర్ ప్రమాదంలో గాయపడిన బాధిత కూలీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కిమ్స్ హాస్పిటల్ పరామర్శించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి సంఘటన కు గల కారణాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ లాంటి సంఘటనకు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

పోస్టర్ ఆవిష్కరించిన బిజేపి మండల అధ్యక్షులు జాడి దిగంబర్



అసిఫాబాద్ - ప్రభాత సూర్యుడు :

భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పరి పాలనలో పారదర్శకంగా అమలు చేసిన ప్రభుత్వ పథకాల కరపత్రాలు, స్టిక్కర్లను భారతీయ జనతా పార్టీ కొమురంభీం (ఆసిఫాబాద్) జిల్లా బెజ్జూర్ మండల అధ్యక్షుడు జాడి దిగంబర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనల్లో అమలు చేసిన అభివృద్ధి పథకాలను మండలంలోని గ్రామాల్లో శక్తి కేంద్ర ఇన్చార్జీలు, బూత్ అధ్యక్షులు ఇంటింటా తిరుగుతూ స్టిక్కర్లు, కరపత్రాలను అందజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉమ్మెర బాలకృష్ణ , తాళ్ళరామయ్య, లింగాల శంకరయ్య, కోలా కిష్టయ్య, వసి ఉల్లా ఖాన్, మెస్రం రాజారామ్, కోర్తె తిరుపతి, ఉమ్మెర కిషన్ గోపాల్, ఆత్రం రామయ్య, రాజయ్య, నారాయణ, సత్యవాన్, చంటి, బషీర్ ఖాన్, శ్రీనివాస్, కిషన్, రమేష్ తదితరులున్నారు.

## ఫ్లై ఓవర్ ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : హైదరాబాద్ నగరంలో ఎల్బీనగర్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని పుర పాలక శాఖ మంత్రి కే. తారకరా మారావు సికింద్రా బాద్లోని కిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, వారి యోగక్షేమలు తెలుసు కున్నారు. ప్రమాదం జరిగిన తీరును మంత్రి కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గాయపడిన వారికి పూర్తి అండగా ఉంటుందని, చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తుందని, ఈ విషయంలో ఎలాంటి ఆం దోళన చెందవద్దని మంత్రి కేటీఆర్ వారికి భరోసా ఇచ్చారు. జరిగిన ఘటన దురదృష్టకరమన్న కేటీఆర్, ఈ ప్రమాదం పట్ల పురపాలక శాఖ పూర్తిస్థాయి విచారణ చేప డుతుందని తెలిపారు. ప్రమాదానికి కారణమైన అంశాల పైన జిహెచ్ఎంసి ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలో ముగ్గురితో కూడిన కమిటీకి అదనంగా జేఎన్టీయూ యూ నివర్సిటీ ఆధ్వర్యంలో విచారణ చేయించి, ప్రమాద కార ణాలను తెలుసుకుంటామన్నారు. వర్కింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగితే, కఠిన చర్యలు సైతం తీసు కుం టామన్నారు. మంత్రి కేటీఆర్ వెంట నగర మంత్రి తల సాని శ్రీనివాస్ యాదవ్, ఎల్బీనగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పురపాలక శాఖ అరవింద్ కు మార్, ఇతర పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు

దూప దీప నైవేద్యం క్రింద

# 16 మంది అర్చకులకు ప్రొసీడింగ్స్ అందజేత

జగిత్యాల - ప్రభాత సూర్యుడు : తెలంగాణ ప్రభుత్వ పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, త్రాగునీరు, సంక్షేమం, అభివృద్ధి వంటి రంగాలలో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం రోజున జిల్లా లోని సారంగాపూర్ మండలం పెంబట్ల శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో దూప దీప నైవేద్యం క్రింద 16 మంది అర్చకులకు ఉత్తర్వులను అందించారు.

తొలుత ఎమ్మెల్యే కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వేద మంత్రాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా, సుఖ సంతోషాలతో, అభివృద్ధి చెందాలని పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సిఎం పరిపాలనలో గడచిన 9 సంవత్సరాల కాలంలో రాష్ట్ర అభివృద్ధి సాధించిన ప్రగతి వివరాలు తెలియ జేసేందుకు



దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల నియోజక వర్గంలో 88 లక్షలతో పలు దేవాలయాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. అన్యమతాలకు అభివృద్ధి ఫలాలను అందించారని తెలిపారు.జగిత్యాల జిల్లాలో కొత్తగా 66 మందికి దూప దీప నైవేద్యం క్రింద అర్చకుల వేతనాలు పెంచామని, అందులో భాగంగా జగిత్యాల నియోజక వర్గంలో 16 మందికి కొత్తగా మంజూరు ఉత్తర్వులు అందిస్తున్నామని తెలిపారు.

రానున్న రోజుల్లో మరిన్ని దేవాలయ అర్చకుల వేతనాలను పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు. కొండగట్టు, వేములవాడ, ధర్మపురి వంటి దేవాలయాల అభివృద్ధికి కోట్లాది నిధులు సమకూరుస్తామని ప్రకటించారని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం 16 మంది అర్చకులకు ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమాలలో వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, ఈఓ వేణుగోపాల్,డిబిసీడివో సాయిబాబా, ఎంపిపి, ఎంపీడీఓ, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీలతో కూడిన అప్పులకు వీలైనంత దూరంగా ఉండాలి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : సకాలంలో అప్పులు చెల్లించడం అత్యంత తెలివైన పని. అలా నడుచుకుంటే చెల్లించాల్సినవేమీ రుణభారం ఏమీ ఉండదు. అప్పు లేకుండా సేవింగ్స్, ప్లానింగ్స్‌పై దృష్టిపెట్టవచ్చు. ఇక పెట్టుబడి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పెట్టుబడి పెట్టడమంటే పెద్ద మొత్తంలో డబ్బు ఉండాల్సిన అవసరమేమీ లేదు. చిన్న మొత్తంలో కూడా పెట్టుబడి పెట్టొచ్చు. అంటే ఆదాయంలో కొద్ది మొత్తాన్ని దాచిపెట్టుకోవచ్చు. ఇలా చేస్తే ఇబ్బందుల్లో ఉన్న ఈ డబ్బును ఉపయోగించుకోవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.ఖర్చులకు సంబంధించి చక్కటి బడ్జెట్‌ని రూపొందించుకోవాలి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఈ బడ్జెట్‌ని రూపొందించుకోవాలి. అప్పులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలి. ముఖ్యంగా వడ్డీలతో కూడిన అప్పులకు వీలైనంత దూరంగా ఉండాలి. అధిక వడ్డీ ఉండే లోన్ల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. సకాలంలో చెల్లింపులు చేస్తూ ఉండాలి. క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపు విషయంలో కూడా ప్రణాళికబద్ధంగా ఉండాలి.మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఖర్చులకు సంబంధించిన లెక్కలను ఎప్పటికప్పుడు రికార్డ్ చేసుకుంటూ ఉండాలి. తద్వారా అనవసర ఖర్చులు ఏంటనేవి కూడా తెలిసిపోతాయి. మరోవైపు అవసరమైన వస్తువుల కొనుగోలుకు మాత్రమే ఖర్చు పెట్టాలి. ఉపయోగపడని వస్తువులపై కూడా ఖర్చు పెట్టకూడదు. రిటైర్మెంట్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం చాలా ఉపయోగకరం. ఇక మనీ సేవ్ చేయడమంటే డబ్బు సంపాదిస్తున్నట్టేనన్నే విషయాన్ని మరచిపోకూడదు. ఆదాయాన్ని మంచి ఖర్చులు చేయకూడదు. లభ్యమవుతున్నాయి కదా అని అప్పులు కూడా చేయకూడదు. ఆదాయ వ్యయాల నిష్పత్తిని లెక్కించుకొని జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ అలవాట్లను నేర్చుకునేవారు డబ్బు సంపాదనలో ముందుంటారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

విమర్శలు - ప్రతి విమర్శలు మానండి

# బహిరంగ చర్చలకు సిద్ధం కండి

- మంత్రి కొప్పులకు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలకు చుక్క గంగారెడ్డి పిలుపు
- అనవసరంగా ప్రజలను, కార్యకర్తలను అయోమయానికి గురి చేయొద్దు
- స్వార్ధ రాజకీయాల కోసం వ్యక్తిగత విమర్శలు అవసరమా...?
- అభివృద్ధి పనులమీద, పెరిగిపోతున్న అవినీతి
- అక్రమాలపైన దృష్టి పెట్టండి
- తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి

జగిత్యాల - ప్రభాత సూర్యుడు : తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి లు ఒకరిపై ఒకరు విమర్శలు - ప్రతి విమర్శలు మాని బహిరంగ చర్చలకు సిద్ధం కావాలని సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ జనసమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి బుధవారం పిలుపునిచ్చారు. స్వార్థ రాజకీయాల కోసం వ్యక్తిగత విమర్శలు అవసరమా...? అని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల మీద, విచ్చలవిడిగా పెరిగిపోతున్న అవినీతి - అక్రమాలపైన దృష్టి పెట్టాల్సింది పోయి స్వలాభం కోసం, స్వార్ధ రాజకీయం కోసం వ్యక్తిగత విమర్శలు చేసుకుంటూ అనవసరంగా ప్రజలను, మీ - మీ పార్టీల కార్యకర్తలను అయో మయానికి గురి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఒక బాధ్యత గల ప్రజాప్రతినిధులు గా ఉన్నత పదవుల్లో ఉండి వారి స్థాయిని మైమరచి, దిగజారిన మాటలతో విమర్శలు - ప్రతి విమర్శలు చేసుకోవడం సమంజసమేనా...? అని హితవు పలికారు. బహిరంగ చర్చలకు సిద్ధమా....? అంటే.... నీవు సిద్ధమా...?? అంటూ ఒకరికొకరు సవాళ్లు విసురుకున్న మీరిద్దరూ (కొప్పుల ఈశ్వర్, టి.జీవన్ రెడ్డి లు) బహిరంగ చర్చకు హాజరై వాస్తవాలు మాత్రమే మాట్లాడాలని ఆయన కోరారు. మీ బహిరంగ చర్చలు సఫలం అయితేనే మీ వల్ల ప్రజల్లో, కార్యకర్తల్లో నెలకొన్న అయోమయం, ఆందోళన, అనుమానాలు తీరుతాయని ఆయన సూచించారు. ఒకవేళ మంత్రి కొప్పుల ఈశ్వర్ గానీ, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి గానీ బహిరంగ చర్చలకు సిద్ధం కాకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చుక్క గంగారెడ్డి హెచ్చరించారు. ఆవులు - ఆవులు కొట్లాడి లాగెల కాళ్ళు విరగ్గొట్టినట్లు మీ ఇద్దరి సమాళ్ళు - ప్రతి సవాళ్లు, విమర్శలు - ప్రతి విమర్శలు గ్రామాల్లో అమాయక కార్యకర్తలకు తగాదాలు సృష్టిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. సమాజంలో గానీ, ప్రజల్లో గానీ రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతులు గాంచిన మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి లు , వెంటనే బహిరంగ చర్చలకు సిద్ధమై మీవల్ల ప్రజల్లో, కార్యకర్తల్లో నెలకొని ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, ప్రజలను, మీ - మీ పార్టీల కార్యకర్తలను, నాయకులను అయోమయం నుండి బయటకి తీసుకురావాల్సిన బాధ్యత మీ పైననే ఉందని చుక్క గంగారెడ్డి తెలిపారు.

# దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
వేముల రామకృష్ణ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని తెలంగాణ ప్రభుత్వం వృథాచే స్తోందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాలను నిరసిస్తూ నల్ల కండువాలతో విద్యానగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లా డుతూ..ఐదువేల కోట్ల పెండింగ్ ఫీజు రియిం బర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా, దశాబ్ది ఉత్సవాల అన్న పేరుతో ప్రజాధనాన్ని వృథా చే యడం ఎంతవరకు సమంజసమన్నారు. సకాలంలో ఫీజు రియింబర్స్మెంట్ అమలు చేయక యాజమా న్యాలు సర్టిఫికెట్, హాల్ టికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్/ఎంబీఏ/ఎంసీఏ/పీజీ/డిగ్రీ/ఇంటర్ ఐఐ.టీ - ఐ.ఐ.ఎం - ఎన్.ఐ.టి తదితర కాలేజీ కోర్సులు చదివే బి.సి. విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని, పెరిగిన ధరల ప్రకారం ఎస్సీ/ఎస్టీ/బిసి కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని,. ఈ సంవత్సరంలో అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కు ఒకటి చొప్పున 199 బి.సి గురుకుల పాటశాలలు మంజూరు చేయాలని,. ఫీజు నియంత్రణ చట్టం అమలుపరచాలని,. గురుకులాలలో ధరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా విద్యను అందించాలని, ధరఖాస్తు చేసుకొన్న ప్రతి విద్యార్థికి విదేశీ విద్యా నిధులు మంజూరు చేయాలని, రాష్ట్రంలో కాలేజీ హాస్టళ్ళు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాటికి స్వంత భవనాలు నిర్మించాలని, పాత కలెక్టర్ భవనాలను కాలేజీ హాస్టల్ లకు కేటాయించాలని,బి.సి స్టడీ సర్కిల్ కు 200 కోట్లు కేటాయించాలి. కోచింగ్ పద్దతులు మార్చాలని, .అర్హులందరికీ ఊఅ, గ్రూప్-1,2,3,4 సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే ఇతర పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలని డిమాండ్ చేసారు.నిరసన కార్యక్రమంలో అనంతయ్య, గడ్డం నరసింహ, శంకుయాదవ్, ఈశ్వర్, ప్రదీప్, నిరంజన్, వంశీ, కిరణ్, జనార్ద న్, కరుణాకర్, వేణు తదితరులు పాల్గొన్నారు..

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICA-TION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com